
# ప్రభుత్వం వారి ప్రేమలేఖ

మినీ కథ

రాజ్ శ్రీనివాస్




వీధి గుమ్మం దగ్గిర స్కూటర్ పార్క్ చేసి ఈలవేసుకుంటూ లోపలికి నడిచాను 'ఏవోయ్! ఇంకా రెడీ కాలేదా?' అంటూ. నా పిలుపుకు సమాధానంగా శ్రీమతి నవ్వుకుంటూ లెక్క ప్రకారం రావాలి. కానీ రాలేదు ఎంచేతో! మధ్యాహ్నం భోంచేసి వెళ్ళేటప్పుడు సాయంత్రం ఆరింటికి రెడీగా ఉండమని సినిమాకి వెళ్దామని చెప్పి వెళ్ళాను. ఇంకా ఏ బాత్ రూంలోనో ఉండుంటుంది.' అబ్బ! ఏం ఆడవాళ్ళు' అని లోలోపల విసుక్కుంటూ బెడ్‌రూంలోకి నడిచాను. మంచం మీద నలిగిన దుస్తులతో అటు తిరిగి పడుకునుంది. గుండె గతుక్కుమంది. కొంపదీసి ఏ జ్వరమయినా రాలేదు కదా అనుకుని మెల్లిగా వెళ్ళి "సుమతీ" అన్నాను. దిగ్గునలేచి కూర్చుంది. బుగ్గలమీద కన్నీటిచారికలు, చాలాసేప ట్నుంచి ఏడ్చినట్టున్న ఉబ్బిన కళ్ళు, తీక్షణంగా మాస్తూ, పరుపు క్రిందనుంచి ఓ ఉత్తరం తీసి నా ముఖాన కొట్టింది.' అమ్మయ్య! ఇదేదో ప్రణయకలహం కాబోలు' అనుకుంటూ ఆ ఉత్తరం అందుకున్నాను. ఉత్తరం చదవడం పూర్తిచేసేసరికి నా తల తిరిగి పోయింది. ఆ ఉత్తరం సారాంశం...

శ్రీ శ్రీవారికి,

మీ ముద్దుల కనకాంబరం వ్రాయునది: నేను క్షేమం. మీరు నన్ను ఇక్కడ వదిలి వెళ్ళిందగ్గిరనించీ, అనుక్షణం మీరే గుర్తువస్తున్నారు. మన ఏకాంత రాత్రులు, మీ చిలిపితనం ఇంకో నా బుగ్గల్ని ఎరుపెక్కిస్తూనే ఉంటి. మూడ్నెల్ల క్రితం మీరెవరో నేనెవరో, ఏమిటో ఈ బంధం అన్పిస్తోంది. మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. మళ్ళీ శ్రీవారి రాకెప్పుడో? ఈ వియోగం నేను భరించలేను. నాకు ఉత్తరాలు వ్రాయడం చేతకాదు. అందుకే ఇక ఆపేస్తున్నాను.

అనేకమైన ముద్దులతో
మీ
కనకాంబరం

నాకు పూర్తిగా మతిపోయిందేమో అని అనుమానం వచ్చింది. నిజాయితీ నిరూపించుకోవాలనే తాపత్రయం వచ్చింది. "ఒట్టు సుమతీ! నీ తోడు. ఈ ఉత్తరం ఏమిటో, ఈ కనకాంబరం ఎవరో నాకంతా అయోమయంగా ఉంది" అన్నాను. "చాలించండి మీ కబుర్లు. మీ మగాళ్ళెంతకయినా తగుదురు! ఎన్ని కబుర్లయినా చెప్పగలరు. అదెవతో మీకు తెలీకుండానే, మీ అడ్రసు ఇంటిపేరుతో సైతం అంతకరెక్టుగా వ్రాసిందా? మీ కల్లబొల్లి మాటలు నాదగ్గిర చెప్పకండి... నంగనాచిలా ఉండేవారు....అదెవత్తో ఏమందోమాకో పెట్టేసింది." వెక్కిళ్ళు...ఏడుపు...ఇంక నేనేం చెప్పినా వినే పరిస్థితిలో లేదు. అడ్రసు చూశాను. కార్డుమీద ముత్యాల్లాంటి అక్షరాలతో నా పేరు, నా యింటి పేరుతో సహా ఉంది.

' సరే! కొంతసేపు ఏడిస్తే, నెమ్మదిగా నచ్చచెప్పవచ్చు' అనుకుంటూ 'నానమ్మా! కొంచెం కాఫీ ఇవ్వు!' అంటూ వంటగదిలో కెళ్ళి నానమ్మ దగ్గిర కాఫీ తీసుకుని చప్పరిస్తూ ఈజీ ఛైర్‌లో కూర్చుని, 'ఇదెక్కడి గొడవొచ్చి పడిందిరా బాబూ!' అనుకున్నాను. ఇదంతా కలానిజమా! గిల్లి చూసుకున్నాను. కార్డుమీద మళ్ళీ చూసేను. సందేహంలేదు. ఇదే అడ్రసు. పోనీ ఎక్కడ్నుంచి వచ్చిందో చూద్దాం అని ముద్ర చూసేను. రాజమండ్రి అని ఉంది. సరే ఎప్పుడు డిస్పాచ్ అయిందా అని తేదీ ముద్ర చూసాను. ఆ తేదీ చూడగానే పొలమారింది నాకు. 1-3-1936 అని ఉంది స్టాంపు ముద్ర.' అంటే సుమారు 49 సంవత్సరాలయిందన్నమాట,' అనుకుంటూ లేచి అటూ ఇటూ గదిలో పచార్లు మొదలెట్టేను. యథాలాపంగా నా దృష్టి గోడ మీదికి తిరిగి అక్కడున్న తాతయ్య చిత్రపటం మీద ఆగింది. అప్పట్లో ఎవరో తాతయ్య ఫ్రెండ్ తాతయ్యకి ప్రెజంట్ చేసేట్ట. చిత్రపటం క్రింద 'తోటకూర సుందరరామారావు' జననం...వగైరాలూ ఉన్నాయి. కానీ అవేవీ నాక్కనపడలేదు. కేవలం తాతయ్య పేరే నాక్కనబడుతోంది. మెదడులో ఫ్లాష్... 'అవును! ఇది తప్పకుండా తాతయ్య కొచ్చిన ఉత్తరమే, నా పేరూ అదే కనుక ఇంతగొడవొచ్చి పడింది. ఇన్నాళ్ళా ఈ ఉత్తరం ఏ పోస్ట్ ఆఫీసులో పడిఉందో! ఇది నానమ్మ కేసు. అనుమానం లేదు. తాతయ్యపోయి చాలా కాలం అయింది. ప్రేమలేఖలోని కనకాంబరం ఎవరో నానమ్మకి తెలిసే ఉంటుంది. అడుగుదాం!' అనుకుని వంటగదిలోకి ఓ గెంతు గెంతాను. "పడిపోతావురా భడవా!" అంది నానమ్మ. మరొకప్పుడయితే నన్ను భడవా అన్నందుకు ఆవిడతో తగువు పెట్టుకుందును గానీ, ఇప్పుడు నా అవసరం గదా ఉత్తరం గొడవంతా చెప్పేను. అప్పుడు నాయనమ్మ ఉత్తరం చదివింది. కొంతసేపు నిశ్శబ్దంగా ఉండిపోయి తర్వాత నవ్వడం మొదలుపెట్టింది. "మీ తాతయ్యకి నేను వ్రాసిన ఉత్తరం చదువుతావా? భడవా?" అని తిట్టింది. "మరి నీ పేరు సత్యవతి కదే నానమ్మా, మరి ఈ కనకాంబరం ఏమిటి?" అన్నాను. "అది మీ తాతయ్య నాకు పెట్టిన ముద్దు పేర్రా వెధవా! మీ తాతయ్యకి ఉద్యోగం వచ్చిన కొత్తలో పెళ్ళి చేసుకున్నాక కొన్నాళ్ళు నన్ను మా యింట్లోనే ఉంచి అటూ ఇటూ తిరుగుతుండేవారు. అప్పటికింకా కాపురం పెట్టలేదు. అప్పుడు మీ తాతయ్య నన్ను ఉత్తరాలు వ్రాయమనేవారు. నాకు సిగ్గేసేది. అయినా ఊరుకునేవారుకాదు. వ్రాయక వ్రాయక ఒక్క ఉత్తరం వ్రాస్తే అది మనవడి చేతిలోంచి మళ్ళీ నాకే వచ్చింది" అని నిట్టూర్చింది. నేను బెడ్‌రూంలోకి పరుగెట్టాను సుమతికిదంతా చెప్పడానికి. ●

